

## దేశంలో మరోసారి పార్లమెంటరీ 370 స్థానాలు తప్పకుండా సాధిస్తాం

కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే

4




# ప్రజాజ్యోతి

ఖమ్మం

బుధవారం 28-2-2024 పేజీలు : 6


# పదవ తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాయనున్న 16,577 విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 97 పరీక్షా కేంద్రాలు - పరీక్షల నిర్వహణకు వేల మంది అధికారులు
- పరీక్షా సమయంలో అధికారులందరూ ఐడి కార్డ్ ధరించాలి - జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్



ఖమ్మం, ఫిబ్రవరి 27:
జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖా అధికారులకు ఏర్పాటు చేసిన ఒకరోజు అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు హాజరవుతున్నందున, విద్యార్థులలో పరీక్షల వ్యవస్థ పై విశ్వాసం కలిగేలా పరీక్షల నిర్వహణ ఉండాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నుండి 10,148 మంది, ప్రయివేటు పాఠశాలల నుండి 6,429 మంది, ప్రయివేటుగా 279 మంది, మొత్తంగా 16,577 మంది పరీక్షలు వ్రాయనున్నట్లు, వీరిలో 8,532 మంది బాలురు, 8,045 మంది బాలికలు ఉన్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 97 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసి, 97 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 98 మంది శాఖా అధికారులు, 1,983 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. 53 జోన్లుగా, 6 రూట్లుగా విభజించి, 5 ఫ్లయింగ్ స్క్వాడ్, 97 సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటుచేసినట్లు ఆయన అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారుల ఫోన్ నెంబర్లు ప్రదర్శించాలన్నారు. కనీస మందులతో ఏఎన్ఎం, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వాటర్ బాయ్ నుండి చీఫ్ సూపరింటెండెంట్ వరకు పరీక్షల విధుల్లో ఉన్న వారందరూ ఐడి కార్డులు ధరించాలన్నారు. 18 మార్చి నుండి పదో తరగతి పరీక్షలు జరుగనున్నట్లు, ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు, కనీస మౌళిక ససుపాయాల కల్పన చేయాలన్నారు. ఇన్విజిలేటర్లు పరీక్షకు ఒక గంట ముందుగా చేరుకోవాలన్నారు. ఉదయం 9.35 నిమిషాల తర్వాత పరీక్షకు అనుమతించవద్దని ఆయన తెలిపారు. విద్యార్థులు, అధికారులు, సిబ్బంది అందరికి ఫ్రిస్కింగ్ చేపట్టి, తనిఖీలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రంలో విధుల నిర్వహణ అధికారులకు సంబంధించి బంధువులు ఎవ్వరు పరీక్షలు వ్రాయట్లేదని ధ్రువీకరణ తీసుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లకు లాటరీ పద్దతి ద్వారా గదుల కేటాయింపు చేయాలన్నారు. మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించవద్దని ఆయన అన్నారు. ప్రశ్నాపత్రంలోని ప్రతి పేజీలో విద్యార్థి హాల్ టికెట్ నెంబర్ వ్రాయించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాల ఏర్పాటు ఉండాలన్నారు. గోడ గడియారం...

మిగతా 2లో...

## నేడు పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటన



పాలేరు, ఫిబ్రవరి 27, ప్రజా జ్యోతి
తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజక వర్గంలో బుధవారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం పది గంటలకు తిరుమలాయపాలెంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఆ మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. పదకొండు గంటలకు కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం తో పాటు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తానని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలో మినీ క్రీడా మైదానానికి శంకుస్థాపన చేసి మండలంలోని కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే సాయంత్రం ఐదు గంటలకు 59వ డివిజన్ దానవాయిగూడెంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- నిమిషం ఆలస్యమైనా అనుమతిలేదు - కళాశాల ప్రిన్సిపాల్లు

కారేపల్లి,ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతీ:
నేటి నుంచి మండల వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి.కారేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,ఆదర్శ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 277 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు,212 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు,ఆదర్శ కళాశాలలో 293 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు 263 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించబోమని ప్రిన్సిపాల్ లు తెలిపారు.



# దేశం అభివృద్ధి చెందాలంటే మోడీ ఉండాల్సిందే

## సముద్ర గర్భంలో శ్రీకృష్ణుడి పూజించిన మోడీ కారణ జన్ముడు



**పాలేరు ఫిబ్రవరి 27 ప్రజా జ్యోతి**
ఢిల్లీలో ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడి ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 370 కి పైగా పార్లమెంటు సీట్లు గెలిచి మూడోసారి నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అవ్వడం ఖాయమని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్ర నాథ్ పాండే అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండల కేంద్రంలో పాలేరు అసెంబ్లీ అద్యక్షుడు మేక సంతోష్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం పార్టీ శ్రేణులతో సంకల్ప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల్లో చేపట్టిన విజయ సంకల్పయాత్ర పార్లమెంటు అభ్యర్థుల గెలుపు కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు రాష్ట్రంలో అధికారం లేకపోయినా ఖమ్మంలో ఎమ్మెల్యే అభ్యర్థులు లేకున్నా వికసిత్ భారత్ కావాలని మోడీ పది వేల కోట్లను జాతీయ రహదారికి కేటాయించారని విశ్వకర్మ ద్వారా రుణాలు,ఉజ్వల పథకం ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించి ప్రోత్సహించారన్నారు. దేశ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలతో ఉండాలని 2182 వరి మద్దతు ధర,ఎకరానికి 20 వేల సబ్సిడీ ఎరువులు,కిసాన్ ఛానల్,పంట రవాణాకు కిసాన్ రైలు,15 లక్షల కోట్ల రూపాయలతో రైతులకు రుణాలు,సంక్షేమం దృష్ట్యా ఫసల్ బీమా యోజన వంటి పథకాలను అమలు చేశామని వెల్లడించారు.

**మహిళల ప్రాతినిధ్యం పెంచిన మోడీ..!**
కొత్త పార్లమెంటు భవనంలో 33 శాతం మహిళలకు ప్రాతినిధ్యం వహించేలా మోడీ కృషి చేయడం మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని పెంచారని కొనియాడారు. 73 వయసులోను 18 ఏళ్ల యువకుడుగా అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్లుగా ప్రధాని మోడీ పనిచేస్తున్నాడని వివరించారు. ద్వారక నగరంలోని సముద్ర గర్భంలో మూడు వందల అడుగుల లోతులో వెళ్లి శ్రీ కృష్ణుడికి పూజించిన మోడీ కారణ జన్ముడని ఆయన అవసరం దేశ ప్రజలకి ఉందని అన్నారు. అయోధ్య లో రామాలయ నిర్మాణానికి ఖమ్మం జిల్లా ప్రజలు సహకరించడమే కాకుండా పెద్ద ఎత్తున రైలు మార్గం ద్వారా రాముడిని సందర్శించారని తెలియజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాద్రి రాముడు సన్నిధి నుండి మొదలైన విజయ సంకల్ప యాత్ర భద్రకాళి పాదాల దగ్గర ముగుస్తుందని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ రాష్ట్రంలో బిఆర్ఎస్ లు వారసత్వ కుటుంబ పార్టీలని ఒక తరం తర్వాత మరో తరం ప్రజలను పాలిస్తు దోచుకుంటున్నారని నరేంద్రమోడీకి దోచుకుని దాచుకోవడానికి ఆయన వెనుక వారసులు ఎవరూ లేరని వెల్లడించారు. నీళ్లు,నిధులు,నియామకాల పేరుతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సంపద అంతా దోచుకున్నారని ఎద్దేవా చేశారు. ఖమ్మం ప్రజలు కచ్చితంగా కాషాయ జెండా ఎగురవేసి మోడీ నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి,మాజీ శాసన సభ్యులు మార్తినేని ధర్మారావు, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి తక్కిళ్ళపల్లి రవీందర్ రావు,వాసుదేవరావు,జిల్లా అధికార ప్రతినిధి విజయ రెడ్డీ,జిల్లా అధ్యక్షడు గల్లా సత్యనారాయణ,బజ్జూరి మల్లారెడ్డి,శ్యామ్ రాథోడ్,గడ్డం వెంకటేశ్వర్లు,బొడ్డుపల్లి ప్రసాద్, మంద చంద్ర శేఖర్,పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలంగాణలో నేటినుంచి ఇంటర్ పరీక్షలు

## - భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు అధికారులు - నిముషం నిబంధన ఖచ్చితంగా అమలు - సెంటర్ల వద్ద 144 సెక్షన్

**హైదరాబాద్,ఫిబ్రవరి27:** నేటనుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు బోర్డు అధికారులు తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. నిముషం నిబందన ఖచ్చితంగా అమలు చేస్తారు. మార్చి 19 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఇంటరోబోర్డు ఇప్పటికే అందుబాటులో ఉంచినసంగతి తెలిసిందే. వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. ఆయా తేదీల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,521 సెంటర్లను అధికారులు ఏర్పాటుచేశారు. వీటిలో 880 సెంటర్లను ప్రైవేట్ కాలేజీల్లో, 407 సెంటర్లను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో, మరో 234 సెంటర్లను గురుకులాల్లో ఏర్పాటు చేశారు. ఇక పరీక్షల కోసం 27,900 మంది ఇన్విజిలేటర్లు,విధులు నిర్వర్తించ నున్నట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. అన్ని జిల్లాల్లోనూ అవసరాలకు తగ్గట్టుగా ప్రభుత్వ పాఠశాలల టీచర్లు, సిబ్బందిని పరీక్షల విధుల్లోకి తీసుకొంటున్నట్టు వివరించారు. కలెక్టర్లు, పోలీసు అధికారులు పరీక్షాకేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. చీఫ్ సూపరింటెండెంట్లు-1,521 మంది; ఫ్లయింగ్ స్కాడ్-75 మంది; సిట్టింగ్ స్కాడ్ - 200 మంది విధులు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 9,80,978 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 4,78,718 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. ద్వితీయ సంవత్సరం నుంచి 5,02,260 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. సెకండియర్ పరీక్షలకు హాజరయ్యే వారిలో 58,071 మంది ప్రైవేట్ విద్యార్థులున్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు నిమిషం ఆలస్య మైనా అనుమతించబోమని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శృతి ఓజా సూచించారు. పరీక్షల నేపథ్యంలో ఆమె సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అన్నిశాఖలతో సమన్వయం చేసుకుని.. గతానికి భిన్నంగా పరీక్షలు నిర్వహించాలని తాము సంకల్పించినట్టు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, డ్యూయల్‌డెస్క్ బెంచీలు వంటి వసతులు కల్పించామని తెలిపారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. సెల్‌ఫోన్లపై కఠిన ఆంక్షలు విధించారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌ను ప్రోత్సహించిన యాజమాన్యాలపై సెక్షన్ -25 ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటారు. ప్రతీ పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుంది. తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎస్సెస్సీ లేదా మొదటి ఏడాది హాల్‌టికెట్ నంబరుతో థియరీ పరీక్షల హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## పదవ తరగతి పరీక్షలు...

(మొదటిపేజీ తరువాయి)



ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రశ్నాపత్రాలు సిసి కెమెరాల నిఘాలో తెరవాలన్నారు. ఎక్కడ ఎటువంటి చిన్న తప్పిదం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, విద్యా శాఖ అసిస్టెంట్ కమిషనర్ ధనా, మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, రాములు, ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, నారాయణ, చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బండి ప్రజాహితయాత్రలో ఉద్రిక్తత

**- బిజెపి యాత్రను అడ్డుకున్న కాంగ్రెస్ - ఇరు పార్టీల మధ్య పరస్పర ఘర్షణ**
**- పోలీసుల రాకతో చల్లారిన వాతావరణం**

**సిద్దిపేట,ఫిబ్రవరి27:** బీజేపీ నేత బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్రలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రజాహిత యాత్ర సిద్దిపేట చేరుకోగా.. అక్కడ కాంగ్రెస్ శ్రేణులకు, బీజేపీ శ్రేణులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ప్రజాహిత యాత్రపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి యత్నించారు. ప్రజాహిత యాత్రను అడ్డుకుంటామంటూ కాంగ్రెస్ శ్రేణులు వచ్చారు. దీంతో అలర్ట్ అయిన పోలీసులు.. భారీగా మోహరించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజాహిత యాత్ర క్యాంపు వైపు రాకుండా నిలువరించారు. బీజేపీ నేతలను సైతం ప్రజాహిత యాత్రకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు పోలీసులు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎక్కడికక్కడ చెక్ పోస్టులు పెట్టి బీజేపీ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాం చక్రవర్తిని ప్రజాహిత యాత్ర క్యాంపునకు వెళ్లకుండా నిలువరించారు. తమ పార్టీ నాయకుడిని తాము కలిసేందుకు వెళు తుంటే.. అడ్డుకోవడమేంటని పోలీసుల తీరుపై బొమ్మ శ్రీరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను కూడా ప్రజాహిత క్యాంపువైపు వెళ్లనిచ్చేది లేదని పోలీసులు తేల్చి చెప్పారు. ప్రజాహిత యాత్రపై దాడి చేయాలని చూస్తున్న కాంగ్రెస్ శ్రేణులపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాహిత యాత్రను అడ్డుకోవాలని చూస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మరోవైపు ప్రజాహిత యాత్రకు అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలియడంతో అప్రమత్తమైన బీజేపీ శ్రేణులు.. బండి సంజయ్‌కు మద్దతుగా యాత్ర వద్దకు భారీగా తరలివస్తున్నారు. ఇదిలాఉంటే.. హుస్నాబాద్ నియోజకవర్గం బొమ్మెనపల్లి నుండి రెండోరోజు ప్రజాహిత యాత్రకు బండి సంజయ్ సిద్ధమయ్యారు. దీంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్రిక్తత కొనసాగుతోంది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి నుంచి రెండోరోజు ప్రజాహిత యాత్ర ద్వారా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ కు ఇవాళ బండి సంజయ్ చేరుకోనున్నారు. యాత్రను అడ్డుకునేందుకు పట్టణ శివారులో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇదే సమయంలో బండికి స్వాగతం పలకడానికి బీజేపీ శ్రేణులు అక్కడికి భారీగా చేరుకున్నాయి. డౌన్ డౌన్... ఖబడ్దార్ అంటూ కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల ప్రతి నినాదాలతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. ప్రజాహిత యాత్ర క్యాంపు వైపునకు కాంగ్రెస్ కార్యకర్తలు రాకుండా, అలాగే బీజేపీ కార్యకర్తలను,పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాం చక్రవర్తిని కూడా ప్రజాహిత యాత్రకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామ శివారులో.. హుస్నాబాద్ మండలం రాములపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. మంత్రి పొన్నంపై బండి వివాదాస్పద కామెంట్స్ చేశారని హస్తం నేతలు హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రోవైపు భారీ బందోబస్తు మధ్య బొమ్మనపల్లి నుంచి ప్రజాహిత యాత్ర ప్రారంభమైంది. శాంతియుతంగా చేస్తున్న యాత్రను అడ్డుకోవద్దని కాంగ్రెస్ నేతలకు బండి సంజయ్ సూచించారు.

## ఎయిడ్స్ నియంత్రణపై కళజాత ప్రదర్శన



**బోనకల్, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారం హెచ్ఐవీ,ఎయిడ్స్ పై కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి వి స్రవంతి ఆధ్వర్యంలో కళాజాత బృందం ప్రదర్శన నిర్వహించారు. ఈ సంధర్భంగా స్రవంతి మాట్లాడుతూ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సోకిన వారికి అందించే వైద్య సేవలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎయిడ్స్ పై సరైన అవగాహన లేకపోవడంతో చాలామంది అపోహలతో ఎదుటివారిని హేళన చేస్తూ ఉన్నారని అలాంటివి సరైన పద్ధతి కాదని కళాజాత వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది,ఆశాలు పాల్గొన్నారు.

## భువనగిరి సీపీని కలిసిన నారపోగు వెంకట్

**తల్లాడ, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి న్యూస్):**



భువనగిరి జిల్లా పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్రుని రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షులు, తల్లాడ మండలం గొల్లగూడెం మాజీ సర్పంచ్ నారపోగు వెంకట్(వెంకటేశ్వర్లు) కలిశారు. మంగళవారం భువనగిరి జిల్లా పోలీస్ కమిషనర్ రేట్ కార్యాలయంలో ఆయన సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా నారపోగు వెంకట్ మాట్లాడుతూ తన చిరకాల స్నేహితుడు రాజేష్ చంద్రను స్నేహపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ విన్నర్స్ పబ్లికేషన్ అధినేత ప్రసన్న హరికృష్ణ, రైట్ ఛాయిస్ ఐఏఎస్ అకాడమీ అధినేత కిరణ్ కుమార్ ఉన్నారు.

## పాముకాటుతో విజయ్ కుమార్ మృతి

### వెంగన్నపేటలో విషాదం



**తల్లాడ, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి న్యూస్):** తల్లాడ మండలంలోని వెంగన్నపేట గ్రామానికి చెందిన కొనకంచి విజయ్ కుమార్ (యాకోబు 51) పాముకాటుకు గురయ్యాడు. ఇంటి వద్ద పాముకాటుకు గురికావడంతో వెంటనే కల్లూరు ఆసుపత్రికి తరలించగా అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ పరిస్థితి విషమించటంతో మృతి చెందారు. మృతునికి భార్య స్వరూప, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన ఆకస్మిక మృతితో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. మాటల్లో ఆప్యాయత, ఊరిలో మంచి వ్యక్తిత్వం కనపరుస్తు తన కుటుంబాన్ని పోసించుకుంటు తనుకున్నదనిలో సంతృప్తిగా జివించగలిగే మృదుస్వాబి. పిల్లలు ఉద్యోగాలు చేసి తనకు తోడుగా ఉండే సమయానికి కానరాని లోకాలకు వెళ్లిపోయాడంతో కుటుంబ సభ్యుల రోదనలు కన్నీరు తెప్పిస్తున్నాయి. ఒక రైతుగా, ఊరిలో మంచి వ్యక్తిగా భార్య, పిల్లలకు మంచి ఇంటి యజమానిగ తనలో ఎటు వంటి మచ్చ లేకుండా జీవించ గలిగిన విజయ కుమార్ మృతి ఎంతో బాధకరం అని గ్రామంలో పెద్దలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సంతాప సానుభూతిని తెలియజేశారు.

# సాయినాధుని పల్లకిని మోసిన ఆలయ చైర్మన్ లక్ష్మణ్‌రావు

### పూజలు చేసిన మాజీ సర్పంచ్ మమత





**తల్లాడ, ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి న్యూస్):** లితల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో శ్రీ షిరిడి సాయిబాబా 16వ వార్షికోత్సవం రేపు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సాయినాధున్ని అన్నారుగూడెం పురవీధుల్లో పల్లకి సేవ భారీ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారెళ్ళ లక్ష్మణరావు, నాయకులు తుమ్మలపల్లి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పల్లకిని మోశారు. ఈ సందర్భంగా తొలుత సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన సాయిబాబా మందిరం వార్షికోత్సవంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నేడు ఆలయ వార్షికోత్సవం తో పాటు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, భక్తులందరూ హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సభ్యులు దుగ్గినేని గోపయ్య, నున్నా సాందీపులు, పూనాటి సత్యనారాయణ, పాపినేని మధుసూదన్ రావు, ఆపతి రామారావు, మల్లిడీ వెంకటేశ్వర్లు, మల్లిడి శేషయ్య, ఆపతి రామారావు, మారెళ్ళ వెంకటేశ్వరరావు, పసుమర్తి పుల్లారావు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తులో హల్చల్...పత్రికా విలేఖరి పై దాడి

### తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు





**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి :** గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి పత్రికా విలేకరిపై దాడి చేసిన సంఘటన తిరుమలాయపాలెం మండల వ్యాప్తంగా కలకలం రేపింది. తిరుమలాయపాలెం మండలంలో పత్రికా విలేకరుగా విధులు నిర్వహిస్తున్న కామల్ల వీరయ్య మంగళవారం పిండి ప్రోలు శివారులో ఉన్నటువంటి గణేష్ రెస్టారెంట్లో భోజనం చేస్తున్న అతనిపై పిండిప్రోలు గ్రామానికి చెందిన రావిండ్ల అశోక్ గంజాయి మత్తులో పత్రికా విలేకర్ కామల్ల వీరయ్యతో ఘర్షణకు దిగి ఈ పత్రిక విలేకరులే పత్రికలలో గంజాయి గురించి వార్త కథనాలు రాస్తూ మమ్ములను పోలీసులకు పట్టిస్తున్నారని బూతులు తిడుతూ..

పక్కనే టేబుల్ పై ఉన్న స్టీల్ వాటర్ జగ్గుతో పత్రికా విలేకర్ ముఖం పై బలంగా కొట్టి రక్తం వచ్చేలా గాయపరిచాడు. వెంటనే పత్రిక విలేఖరి కామాల్ల వీరయ్య తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్లో రావిండ్ల అశోక్ పై ఫిర్యాదు చేశాడు. విలేకరిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలివిధి నిర్వహణలో ఉన్న పత్రిక విలేకరి కామల్ల వీరయ్య పై గంజాయి మత్తులో దాడి చేసిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేయాలని టీయూడబ్ల్యూజే ఐ జే యు జిల్లా నాయకులు పప్పుల శ్రీనివాసరావు, బోడపట్ల సతీష్, మేకల నాగరాజు డిమాండ్ చేశారు.

# స్నేహితుడు మృతికి చలించి అండగా తోటి స్నేహితులు



**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27, ప్రజా జ్యోతి :** స్నేహానికి మరణం లేదు అని నిరూపించిన.... బాల్యం నుండి కలిసి చదువుకున్న విద్యార్థులు పదవ తరగతి వరకు కలిసిమెలిసి స్నేహంగా ఉండి అనంతరం వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన స్నేహితులు బాల్యంలో చదువుకున్న స్నేహితుడు మృతి చెందాడని తెలుసుకొని చెలించిపోయారు పిండిప్రోలు గ్రామానికి చెందిన మీగడ మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా పిండిప్రోలు జెడ్ పి ఎస్ ఎస్ హై స్కూల్ లో 1983 - 84 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తన స్నేహితుడు మృతి చెందాడని తెలుసుకొని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 సంవత్సరాల అవుతున్న తన స్నేహితుడు మృతిని తెలుసుకొని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రైవేటు ఉద్యోగాల్లో వ్యాపార రంగాల్లో స్థిరపడ్డ స్నేహితులు కలిసి మల్లయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. మల్లయ్య కుటుంబానికి 11500 రూపాయల నగదు, బియ్యం, నిత్యవసర సరుకులు అందించి ఎల్లప్పుడూ మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రస్తుత సమాజంలో ఇలాంటి స్నేహితులు ఉండటం అరుదు వారిని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ప్రస్తుత యువత మీద ఉంది ఆర్థిక సాయం అందించిన వారిలో దొండేటి సురేష్, బోర్లే లక్ష్మీనారాయణ, దొండేటి కిషోర్, కొంపల్లి నాగేశ్వరావు, కమ్మ కోమ్మటి రమా దేవి, కరుణాకర్ ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 2 వ తేదీ న జరుగు భూ సదస్సును జయప్రదం చేయండి

## వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు



**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి :**
తిరుమలాయపాలెం లో మంగళవారం ప్రజాసంఘాల పోరాట ఐక్యవేదిక సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అంగిరేకుల నరసయ్య అధ్యక్షతన జరిగింది.. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలకు ఇల్లు ఇళ్లస్థలాలు కట్టిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసింది గృహ నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సాగుభూమి, బంజరు భూములు, పోడు భూములు విస్తారంగా ఉన్నాయి వీటన్నింటినీ సద్వినియోగం లోకి తీసుకొచ్చి సాగు చేసుకునేందుకు, ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ప్రజలకు ఇవ్వాలని వారి అభివృద్ధికి ఆర్థిక సహకారాన్ని అందిస్తూ పేద వర్గాలను, హరిజన, గిరిజన వర్గాలను ఆదుకోవాలని, ఈరోజు కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ వ్యవసాయ రంగాన్ని దివాలా తీసే విధంగా కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యవసాయ రంగానికి నిధులను తగ్గిస్తున్నాడని, మరోవైపు వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆ పథకాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఈ సంవత్సరం కేవలం 86 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అసలు ఈ పథకానికి సంవత్సరానికి రెండు లక్షల కోట్లు కేటాయించి సంవత్సరానికి 100 రోజులు పని కల్పించి రోజుకు 600 రూపాయలు ఇవ్వాలి. కానీ ప్రభుత్వాలు ఇవ్వడం లేదు కేవలం సంవత్సరంలో 45 రోజులు మాత్రమే పని జరుగుతుంది అనేక ఆటంకాలను మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుంది మరోవైపున రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12,000 రూపాయలు చొప్పున ఇస్తామన్న వాగ్దానాన్ని గురించి ఏమి మాట్లాడటం లేదు ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కూలి బీమా పథకాన్ని, కూలి బందు పథకాన్ని అమలు చేయాలని ఆయన కోరారు మార్చి రెండో తేదీన ఖమ్మం మంచి కంటి భవనంలో భూ సదస్సు జరుగుతుందని దానిలో అందరు పాల్గొనాలని, జయప్రదం చేయాలని కోరారు ఇంకా ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీనివాస్, సిఐటియు మండల నాయకులు వషపొంగు వీరన్న, రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొమ్ము నాగేశ్వరరావు, బోడపట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికోన్నత పాఠశాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తోపుడు బండి ఆలి

## విందు ఏర్పాటు చేసిన తోపుడు బండి అధినేత ఆలీ



**కల్లూరు ఫిబ్రవరి 27(ప్రజాజ్యోతి):**
పట్టణ పరిధిలోని బాలికోన్నత పాఠశాల నందు 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు పరీక్షల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థినిలకు 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిలు వీడ్కోలు పలికి వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తోపుడు బండి ఫౌండేషన్ అధినేత సాదిక్ అలీ పాల్గొని 10వ తరగతిలో 10/10 జిపిఏ సాధించిన విద్యార్థిని లందరికి 25 వేల నగదు బహుమతిగా ఇస్తానని తెలియజేశారు. ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యం పెంపొందించడం కొరకు బుక్స్ అందించారు. పాఠశాలలో నీటి వసతికి ఇబ్బందికరంగా ఉండటం వల్ల మోటార్స్ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలో చదువుతున్న ఆరు నుండి 10వ తరగతి వరకు 200 మంది విద్యార్థినిలకు మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. వచ్చే విద్యాసంవత్సర ఆరంభంలో విద్యార్థినిలందరికీ దుస్తులు, అవసరమగు వస్తువులను అందజేస్తానని పాఠశాలలో అడ్మిషన్స్ పెరిగితే పెరిగిన అడ్మిషన్లకు 500 రూపాయలు చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి పద్మ, ఉపాధ్యాయులు విద్యార్థినిలు సీఆర్పీలు పీఈటి వీరరాఘవయ్య, ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ నున్న కృష్ణయ్య పాల్గొన్నారు.

# దేశంలో మరోసారి పార్లమెంటరీ 370 స్థానాలు తప్పకుండా సాధిస్తాము

## భారత జనతా పార్టీ కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే

**కూసుమంచి పిబ్రవరి27 ప్రజా జ్యోతి**
ఖమ్మం జిల్లా కూసుమంచి మండల లో విజయ సంకల్ప యాత్ర సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 370 సీట్లు సాధించి మూడోసారి కూడా మోడీని ప్రధానమంత్రిని చేస్తామని కేంద్రం భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్ర నాథ్ పాండే తెలిపారు మంగళవారం కూసుమంచి మండల కేంద్రంలోని జరిగిన విజయసంకల్ప యాత్ర సభలో ఆయన మాట్లాడుతూ మోడీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచంలో ఆరవ స్థానంలో నిలిపారని మరల మూడవసారి గెలిపిస్తే మూడవ స్థానంలో నిలుపుతారని చెప్పారు. బీజేపీ పాలనలో ఎన్నో సహసపోతమైన నిర్ణయాలు జరిగాయని 73వ వయసులో కూడా మోడీ 18 సంవత్సరాల యువకుడిగా పనిచేస్తూ ప్రపంచంలో గుర్తింపు పొందిన నాయకునిగా ఎదిగారని కొనియాడారు తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దివాళా తీయించి తన కుటుంబాన్ని మాత్రమే అభివృద్ధి చేసుకున్నారని అన్నారు ఈనాడు దేశంలో కాంగ్రెస్ పార్టీకి 40 సీట్లు కూడా గెలిచే పరిస్థితి లేదని చెప్పారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వాగ్దానాలను నిలుపుకోవాలని సూచించారు దేశం అభివృద్ధిలో ప్రయాణించాలంటే ఖమ్మం తో పాటుగా రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో పార్లమెంట్ సీట్లను గెలిపించి మోడీని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు కేంద్రమంత్రి మహేంద్ర పాండే హిందీ ప్రసంగాన్ని మాతినేని ధర్మారావు తెలుగులో అనువాదం చేశారు ఈ సభలో నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి గుజ్జుల ప్రేమి%శ్రీ%ధర్ రెడ్డి కనగాల వెంకట్రావు విజయ్ కుమారి శ్యాం ప్రసాద్ మల్లారెడ్డి ఈవి రమేష్ దేవకి వాసుదేవరావు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి నున్న రవికుమార్ నకిరేకంటి వీరభద్రం గడ్డం వెంకటేశ్వర్లు దాసరి వెంకటేశ్వర్లు అభిమానులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో 2కె వాక్




**ఖమ్మం, ఫిబ్రవరి 27: ప్రజాజ్యోతి**
ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అధికారులు 2కె వాక్ చేపట్టారు. ఇట్టి 2కె వాక్ సాంఘీక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం నుండి మునిసిపల్ కార్పొరేషన్ వరకు కొనసాగింది. ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ ఆర్ఎం విజయ్ కుమార్, ఎపిజీవిబి, యుబిఐ చీఫ్ మేనేజర్లు వీరేందర్, బిస్వాస్, జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి సత్యనారాయణ, పరిశ్రమల శాఖ జీఎం అజయ్ కుమార్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపైకేసునమోదు

## ఎస్సై ఎన్. రాజారాం



**కారేపల్లి, ఫిబ్రవరి 27, ప్రజా జ్యోతి:**
సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండ గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ అనే వ్యక్తి అతని మాయమాటలతో నిరుద్యోగులు నమ్మించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి నిరుద్యోగులను మోసం చేసి ఉద్యోగాలు ఇప్పియ్యలేదని కారేపల్లి ఎస్ఐ ఎన్. రాజారామ్ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ పోలంపల్లి, పేరుపల్లి గ్రామాలకు చెందిన బానోతు తులసిరాం ,అజ్మీర దివ్య ,గుగులోతు రమేష్, బానోతు రఘు అనే వ్యక్తులను వివిధ రకాల ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి సుమారు రెండు కోట్ల రూపాయలు వసూలు చేసినాడు. బాధితులు ప్రశ్నించినప్పుడల్లా రేపుఇస్తా , మా పిస్తా అని దాటి వేస్తూ, వారికి నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్లు, నకిలీ సర్వీస్ రిజిస్టర్ ఇవ్వడం జరిగినది. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఆయన పేర్కొన్నారు.

# మరొకసారి మోడీ సర్కార్

## బిజెపి గెలుపుతోనే ప్రజాస్వామ్యం పరిరక్షణ

**కారేపల్లి, ఫిబ్రవరి27, ప్రజా జ్యోతి**



భారత దేశ రక్షణ కోసం, భవిష్యత్తు తరాల కోసం మరొకసారి దేశంలో మోడీ సర్కార్ రావాలని భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, విజయ సంకల్పయాత్ర కాకతీయ క్లస్టర్ బాధ్యులు మారుతినేని ధర్మారావు అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి కారేపల్లి బస్టాండ్ సెంటర్కు చేరుకున్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల మోడీ పరిపాలన అవినీతి రహితంగా పాలన జరిగిందన్నారు. దేశాన్ని అభివృద్ధి పదం వైపు నడిపిస్తూనే, దేశ ప్రజలందరికి సంక్షేమాన్ని అందించారన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజాస్వామ్య పాలన జరుగుతుందన్నారు. ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి ప్రభుత్వ సహకారంలో భాగస్వాములై తమ ఓటు విలువను ప్రతి ఒక్కరూ పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్యామ్ రాథోడ్, వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు ధనసరి శ్రీను, మండల బిజెపి సీనియర్ నాయకులు తురక నారాయణ, కల్తి రాంప్రసాద్, కొండపల్లి ప్రదీప్, సుజాత, దొడ్డ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన మిర్చీకి ధర తగ్గిస్తే కఠిన చర్యలు

- మిర్చి కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- నాణ్యత పేరుతో రైతులను నష్టపరచవద్దు

- ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ను తనిఖీ చేసిన కలెక్టర్

**ఖమ్మం ఫిబ్రవరి,27:** మిర్చి కొనుగోలు విషయమై రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. కలెక్టర్ మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి, మిర్చి కొనుగోళ్లను తనిఖీ చేశారు. మిర్చి రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మేర దిగుబడి వచ్చింది, ఎంత ధర వస్తుంది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన మిర్చికి ధర తగ్గిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. జెండా పాట రూ. 21,400 వేలు ఉందన్నారు. ధాన్య కొనుగోలులోలా మిర్చి కొనుగోలులో తేమ శాతంపై చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత పేరుపై రైతులను ట్రేడర్లు నష్టపరిస్తే చర్యలు తప్పవని, వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి బస్తా కొనుగోలు అయ్యే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ అన్నారు.జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీం, పిడి ఎంఐపి రమణ, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్, ఏఇఓ శిరణ్మయి అధికారులు తదితరులు ఉన్నారు.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాజ్యోతి, ఫిబ్రవరి 27– ఏన్కూరు :



ఏన్కూరులో ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు గురుకుల విద్యాలయాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో జనరల్, ఒకేషనల్ విద్యార్థులు కలిపి 214 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆరు గదులకు గాను ఆరుగురు ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. సి.ఎస్ గా సుందరం, డి.ఓ గా కే శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు. గురుకుల విద్యాలయ పరీక్షా కేంద్రంలో 224 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు 11 గదులకు గాను 12 మంది ఇన్విజిలేటర్ లను ఏర్పాటు చేశారు. సి.ఎస్ గా శ్రీనివాసరెడ్డి డి.వో గా శ్రీహరి వ్యవహరించనున్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంటది.

### నాటుసారా విక్రేతకు లక్ష రూపాయల జరిమాన

**ప్రజాజ్యోతి, ఫిబ్రవరి 27 – ఏన్కూర్ :** ఏన్కూరు మండలం అక్కినాపురం తండాలో సారా విక్రేతకు కారేపల్లి ఎక్సైజ్ అధికారులు లక్ష రూపాయల జరిమానా విధించారు. అక్కినాపురం తండాకు చెందిన బుజ్జి అనే సారా విక్రేతకు మొదటిసారి పట్టుబడినప్పుడు బైండోవర్ కేసు నమోదు చేశారు. మళ్ళీ సారా అమ్ముతూ పట్టుబడడంతో లక్ష రూపాయల జరిమానా విధించారు. సారా తయారుచేసిన,అమ్మిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహాసిల్దార్ సి.హెచ్ శేషగిరిరావు హెచ్చరించారు. తయారీ,అమ్మకాలు చేపట్టరాదని అన్నారు.

## అంగన్వాడి కేంద్రానికి బీరువా, కుర్చీలు వితరణ

కారేపల్లి, ఫిబ్రవరి 27,ప్రజాజ్యోతి :



సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండా సెక్టార్ కోటిలింగాలపల్లి అంగన్వాడి కేంద్రానికి ఈసాల రాజు ఒక బీరువా, 12 కుర్చీలను మంగళవారం ఐసిడిఎస్ సిబ్బందికి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రానికి మౌలిక వసతులు లేకపోవడం గమనించిన తాను బీరువా, కుర్చీలను అందజేసినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రానికి బీరువా, కుర్చీలను అందజేసిన ఈసాల రాజుకు అంగన్వాడీ టీచర్ వి. లీలావతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వి .లీలావతి, ఆయా ఎం. గురవమ్మ పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్ లేని 44 వాహనాలు సీజ్: ట్రాఫిక్ ఏసీపీ

**ఖమ్మం, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి**




నంబర్ ప్లేట్ లేకుండా నగరంలో చక్కర్లు కొడుతున్న 44 వాహనాలు సీజ్ చేసినట్లు ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు నగరంలో నిబంధనలు అతిక్రమించి రోడ్లపై నడుపుతున్న వాహనాలపై నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ తనిఖీలో భాగంగా ఈరోజు పలు కూడళ్ళలో నెంబరు లేకుండా, రిజిస్టర్ లేని వాహనాలపై కేసులకు జరిమానా విధించినట్లు తెలిపారు. నెంబరు ప్లేట్ ట్యాంపరింగ్ చేసిన స్పోర్ట్స్ బైక్ పై కేసు నమోదు చేసేందుకు ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వారు చలనాల నుండి తప్పించుకోవడంతో పాటు ట్రాఫిక్ పోలీసులు గుర్తించకుండా ఉండేందుకురిజిస్ట్రేషన్ నంబర్ లోని టీఎస్, ఏపీ అక్షరాలతో పాటు చివరి రెండు నంబర్లు కనిపించకుండా స్టిక్కర్స్, ప్లాస్టర్స్,మాస్క్ లు వేస్తున్నారని తెలిపారు. కొన్ని వాహనాలకు ముందు నంబర్ ప్లేట్ కరెక్ట్ గా ఉన్నప్పటికీ వెనుక నంబర్ ప్లేట్ మాత్రం బెండ్ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి రాంగ్ నెంబర్ ప్లేట్లతో రోడ్లపై ఇష్టమొచ్చినటుగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. నంబర్ లేని బైక్స్ పై చైన్ స్నాచర్లు నేరాలు చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. నంబర్ ప్లేట్ లేని వికృతమైన నంబర్ ప్లేట్‌లను కలిగిన వాహనాలపై 420/511 మరియు యం వి చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలలోనే 203 వాహనాలకు జరిమానా విధించడం జరిగిందని, మళ్లీ పునరావృతం ఆయితే కేసులు నమోదు చేస్తునట్లు తెలిపారు.

# ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రెండు నెలలలో కోటి నలబై లక్షల వరకు ఆన్‌లైన్ ద్వారా మోసం
- నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లకుండా 25 లక్షలు ఫ్రిజ్ - బాధితుల ఖాతాలోకి రిఫండ్ అయిన ఆరు లక్షలు
- సైబర్‌నేరగాళ్ల మాయలో పడి మోసపోతే.. సైబర్‌క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయండి - పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి :** ఇటీవల ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని అమాయకులను బురిడీ కొట్టిస్తూ అనేక రకాలుగా నేరాలకు పాల్పడుతున్నారనితెలిపారు.



ఈ ఏడాది ఇప్పటికే 292 ఫిర్యాదు వచ్చాయని తెలిపారు. కోటి నలబై లక్షల వరకు ఆన్‌లైన్ ద్వారా బాధితులు మోస పోయినట్లు తెలిపారు. ఇందులో నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లకుండా 25 లక్షల వరకు ఫ్రిజ్ చేసినట్లు తెలిపారు. పోగొట్టుకున్న నగదు తిరిగి బాధితుల ఖాతాలోకి ఆరు లక్షల రూపాయలు వెళ్లినట్లు తెలిపారు. పెరిగిపోతున్న టెక్నాలజీకి తగ్గట్టుగానే ఖాతాల్లోని డబ్బులు దోచుకోవడమే కాకుండా... ఫోన్లలోని రహస్య సమాచారాన్ని సైతం తస్కరిస్తారని పేర్కొన్నారు. కేవలం అవగాహనలేమి కారణంగా వ్యక్తిగత గోప్యత, భద్రత కోల్పోతున్నారని తెలిపారు. సైబర్‌నేరగాళ్లు ఏదో ఆశ చూపి వల వేస్తుంటారని, నేరగాళ్ల చేతిలో పడి మోసపోతే ...మాత్రం వెంటనే సైబర్‌క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా మీ ఖాతాలో తిరిగి మీ నగదు పొందే ఆవకాశం వుంటుందని సూచించారు. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆధ్వర్యంలో 24/7 ఈ కాల్‌సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. ఈ సెంటర్‌కు వచ్చే కాల్స్‌ను మేనేజ్ చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌ను పోలీసులు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చే కాల్స్ నేరుగా అక్కడ పనిచేసే సిబ్బందికి వెళుతాయని తెలిపారు. ఈ కాల్ సెంటర్‌కు ఆయా బ్యాంకుల రిస్క్‌మేనేజ్‌మెంట్ టీమ్‌లు అనుసంధానమై ఉంటాయని. సైబర్‌నేరాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, తమ వైపు నుంచి తక్షణ చర్యలు తీసుకునేందుకు రిస్క్‌మేనేజ్‌మెంట్ టీమ్స్‌ను అందుబాటులో ఉంటాయని తెలిపారు. దీంతో కాల్‌సెంటర్ నుంచి సమాచారం వెళ్లగానే.. ఆయా బ్యాంక్ రిస్క్ మేనేజ్‌మెంట్ టీమ్స్ అప్రమత్తమై బ్యాంకు ఖాతాల ఆధారంగా డబ్బు ఎక్కడికి వెళ్లిందనే విషయాన్ని గుర్తించి, ఆ ఖాతాలను ఫ్రీజ్ చేస్తారని తెలిపారు. నేరగాళ్లు ఆ ఖాతాల్లో నుంచి డబ్బు డ్రా చేయకుండా ఉంటే.. అందులో ఉండే నగదు కూడా ఫ్రీజ్ అవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా అప్లికేషన్స్ మోసాలు, ఆన్‌లైన్ జాబ్ మోసాలు, కస్టమర్ కేర్ మోసాలు, క్రెడిట్ %డ% డెబిట్ కార్డ్ మోసాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో, ఆధార్ ప్రామాణీకరణ మోసాలు ఇలా అనేక రకాలుగా మోసం చేసినట్లు తెలిపారు. ఇప్పటికి సైబర్ క్రైమ్ పోలీసులు అనేక కార్యక్రమాల ద్వారా యువతకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

# ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్స్కూల్ చైర్ పర్సన్ నిషిత శర్మ - ఉత్సాహంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు

**ఖమ్మం, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి**



ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్కూల్ చైర్ పర్సన్ శ్రీమతి నిషిత శర్మ అన్నారు.శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్ పర్సన్ శ్రీమతి నిషిత శర్మ మాట్లాడుతూ..విద్యార్థులు 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్దేశిత ప్రణాళికలను అనుసరించాలని అన్నారు. పది ఫలితాలు విద్యార్థి భవితను దిశానిర్దేశం చేస్తాయనీ, విద్యార్థి సమగ్ర అభివృద్ధికి సూచికగా నిలుస్తాయని అన్నారు. లక్ష్యం సాధించడానికి ఏకాగ్రత అవసరమనీ, ఇష్టపడి చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు.అనంతరం విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. తదనంతరం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి సంస్కృతిక నృత్యాలను, జానపద కళా రూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సునీల్ సింగ్, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.